ప్రజాశక్తి
బుధవారం 26 జులై 2023
5
పార్వతీపురం మన్యం

31.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి- గుమ్మ లక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం 31.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గరుగుబిల్లిలో 100.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అతి తక్కువగా పాచిపెంటలో 4.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గుమ్మలక్ష్మీపురం 15.8, కురుపాం 21.4, జియమ్మ వలస 34.6, కొమరాడ10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సోమవారం రాత్రి జిల్లా అంతట భారీ వర్షం కురడంతో పొలాలు చెరువులు నీటితో నిండాయి. రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు.

ప్రాధాన్యత అంశాల పరిష్కారంలో శ్రద్ధ వహించాలి

నియోజకవర్గస్థాయి సమావేశాలతో సమస్యలు పరిష్కారం

పరిశ్రమలశాఖా మంత్రి అమర్నాథ్

ప్రజాశక్తి - పార్వతీపురం

అధిక ప్రాధాన్యత క్రమంలో ఉన్న సమస్యల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. సాలూరు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ స్థాయిలో సమీక్షలు చేసి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలు చూపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం రూపొందించారని చెప్పారు. మూడు నెలల్లోపు రాష్ట్రంలోని అనేక సమస్యలు పరిష్కారం కావాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాకు జాతీయ స్థాయిలో అవార్డులు లభించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా అధికారులకు సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు. సాలూరులో 1.5 ఎకరాల స్థలంలో ట్రక్ బే ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికను తనకు అందజేయాలని మంత్రి కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఉన్నతాధికారులకు పంపిన సమస్యల స్థితిగతులు పరిశీలించి సమాచారం అందించాలని సూచించారు. అత్యంత ప్రాధాన్యత పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండాలన్నారు. పెద్దగెడ్డ రిజర్వాయరు పునరావాస పనులు ఇంకా పూర్తి కాకపోవడాన్ని ఉదహరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులను సంప్రదించడం వల్ల సానుకూలంగా, వేగంగా పనులు జరుగుతాయని చెప్పారు. 24 అంగన్వాడీ భవనాలు చిన్న పనులు పూర్తి చేయక అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. సాలూరు - మక్కువ రహదారి రూ.55 కోట్లతో మంజూరైందని, వాటి పనులు పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు. పెద్దగెడ్డ రిజర్వాయరు పునరావాస పనులు, చెరుకుపల్లి గెడ్డ పనులు, అక్వాడేక్ట్ పనులు ప్రాధాన్యతలో చేపట్టాలన్నారు. సురాపాడుపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పాఠశాలల్లో ప్రహరీ గోడలు, గేట్లు, సి.సి కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు ఉండాలని, ఈ మేరకు జిఒ 40 జారీ చేశామని ఆయన అన్నారు. సాలూరు ఆసుపత్రి భవనాలు నవంబరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగు పిహెచ్‌సిల భవనాలు సైతం పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పాచిపెంటతో పాటు అవసరం ఉన్న ఆసుపత్రులను

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్నాథ్, పక్కన డిప్యూటీ సిఎం రాజన్నదొర

సామాజిక ఆసుపత్రులు అప్ గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా గిరిజన ప్రాంతంలో చేపట్టిన టిడ్కో గృహాలు అని, వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. జిజిఎంపిలో డికెటి పట్టల కోసం ఆర్జీలు అందాయని, వాటికి పట్టాలు మంజూరు చేయాలని అన్నారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న రహదారి పనులు అన్ని జిల్లాల్లో ప్రారంభం అయ్యాయన్నారు. అంగన్వాడీ భవనాలు మరమ్మతుల నివేదిక సమర్పిస్తే వాటిని జిల్లా పరిషత్ నుండి మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెదభద్ర, ఇతర గ్రామాలకు వెళ్లే నీటి పథకం నుండి 10 గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు జల జీవన్ మిషన్‌లో ప్రతిపాదించాలని ఆయన సూచించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ శాఖల వారీగా వచ్చే ప్రతిపాదనలు, వాటిపై చర్యలు స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాలు పూర్తి చేయాలని సూచించారు. పాత అంచనాలు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ భవనాలు స్థితిగతుల నివేదిక సమర్పించాలని, వాటికి అవసరమైన నిధులు అంచనా వేయాలని ఆయన పేర్కొన్నారు. దలైవలస వద్ద పెద్దగెడ్డపై డైవర్షన్ లో ముంపుకు గురవుతున్న భూములకు, ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేందుకు భూములను గుర్తించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ప్రహరీ గోడలు, గేట్లు లేని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వివరాలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. గుమడ లేఅవుట్‌కు విద్యుత్ సౌకర్యంక ల్పించాలని సంబంధిత విద్యుత్‌శాఖ ఇఇని ఆదేశించారు. డిఆర్‌ఒ జె.వెంకట రావు మాట్లాడుతూ సాలూరు నియోజక వర్గంలో మూడు మండలాల్లో 33 గ్రామాల నుంచి 341 మంది లబ్ధిదారులకు 368 ఎకరాలు ఆర్‌ఒఎఫ్‌ఆర్ కింద పంపిణీ చేశామన్నారు. తదుపరి చేసిన సర్వేలో 69మంది లబ్ధిదారులు కొత్తగా వచ్చారని, సబ్ డివిజన్ సమావేశంలో పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు. చిలక మెండంగి, బంద మెండంగి, తాడిపుట్టి, దోయవర్ మీదుగా మక్కువ మండలం బాగుజోల నుండి సాలూరు మండలం సిరివర వరకు రూ.13 కోట్లతో రహదారి, సాలూరు నుండి చిన పారన్నవలస రహదారిలో వేగావతిపై అసంపూర్ణంగా ఉన్న శివరాంపురం బ్రిడ్జిని రూ.5.95 కోట్లతో నిర్మించేందుకు అంచనాలు తయారు చేశామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి తెలిపారు. 45 సచివాలయాల భవనాలు, 44 రైతు భరోసా కేంద్రాలు, 39 వై.ఎస్.ఆర్ హెల్త్ క్లినిక్ లు నిర్మాణం జరుగుతున్నాయని, 278 గడప గడపకు మన ప్రభుత్వం పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో 7 రహదారులు రూ.15.40 కోట్లతో నిర్మించినట్టు ఆర్ అండ్ బి అధికారులు చెప్పారు. పెద్దగెడ్డ రిజర్వాయరు పునరావాస పనులు రూ.7.92 కోట్లకు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, చెరుకుపల్లి గెడ్డ పనులు రూ.4.67 కోట్లతో ప్రతిపాదించగా ఆర్థిక శాఖ పరిశీలనలో ఉందని, విఆర్‌ఎస్‌పై అక్వడేక్ట్ పనులు రూ.5.70 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చామని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఆర్.అప్పారావు తెలిపారు. అడారుగెడ్డకు దుగ్గేరు వద్ద ఆనకట్ట కట్టుటకు రూ.4.50 కోట్లతోను, దలైవలస వద్ద పెద్దగెడ్డపై డైవర్షన్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.3 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదించామని అన్నారు. ఇక్కడ గిరిజనులు సాగు చేస్తున్న భూములు ముంపునకు గురవుతాయని, ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని అన్నారు. పెదభద్ర, ఇతర గ్రామాలకు వెళ్లే నీటి పథకం నుండి 10 గ్రామాలకు నీటిని సరఫరా చేయుటకు రూ.12.08 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించామని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకర రావు తెలిపారు. నియోజకవర్గంలో 22 రహదారులు అసంపూర్తిగా ఉన్నాయని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి శాంతీశ్వర రావు తెలిపారు. వర్షా కాలం ముగియగానే పనులు పూర్తి చేస్తామన్నారు. ఇఎ గ్రాంట్‌లో వచ్చిన ఏడు రహదారుల్లో నాలుగు రోడ్లు ప్రారంభించామని ఆయన చెప్పారు. 22 బ్లాకుల్లో 1248 టిడ్కో గృహాలు నిర్మాణం జరుగుతున్నాయని, ఆగస్టు నాటికి పూర్తి అవుతాయని డిఇ తెలిపారు. మౌళిక సదుపాయాలు కల్పనకు రూ.7.76 కోట్లతో పనులు మంజూరయ్యా యని ఆమె తెలిపారు. మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు మాట్లాడుతూ పట్టణంలో రూ.కోట్లతో పార్కు నిర్మాణానికి ప్రతిపాదించా మన్నారు. సాలూరు అత్యధిక లారీలు ఉన్న ప్రాంతమని, ఆటో నగర్ అవసరమని, రూ.10 కోట్లతో ఏర్పాటుకు ప్రతిపాదించామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు, సాలూరు నియో జకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో తీర్మానాలు

అనంతరం జిల్లాలో గృహ అవసరాలు ఎక్కువగా ఉన్నందున, ఇప్పటికే సొంత స్థలాలుగా గుర్తించిన లబ్దిదారులతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన అర్జీలను కూడా మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించారు.

గిరి శిఖర ప్రాంతాలు వంటి విభిన్న భౌగోళిక ప్రాంతాలు ఉన్న దృష్ట్యా యూనిట్ ఖరీదు అదనంగా కొంత మొత్తం మంజూరుకు తీర్మానించారు.

సాలూరులో ఇపిడిసిఎల్ ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే విభాగం నుండి సేవలు అందిస్తున్నందున ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా రెండుగా విభజించాలని తీర్మానించారు.

పాఠశాల పనులను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే

ఏకలవ్య పాఠశాల నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి -భామిని

భామినిలో రూ.12 కోట్లతో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల పనులను గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే మంగళ వారం పరిశీలించారు. ఇంతవరకు ఈ మేరకు నిర్మాణం జరిగిందనే అంశాలు అడిగారు. భవన నిర్మాణాలు నాణ్యతగా ఉండాలని, భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలు క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షించాలని ,కొద్దిరోజుల్లో భవనాలు విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో పిఒ కల్పన కుమారి, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

తోటపల్లి వద్ద జరుగుతున్న తాగునీటి సరఫరా పనులను పరిశీలిస్తున్న ప్రసన్నకుమార్

రూ.12 కోట్లతో తాగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

టిడ్కో ద్వారా రూ.12 కోట్లతో నాలుగు నెలల్లో తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉన్న 768 గృహాలకు, పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో మంచి నీటి సరఫరా అందించే దిశగా తోటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువ వద్ద జరుగుతున్న పనులను టిడ్కో, మునిసిపల్ అధికారులతో కలిసి టిడ్కో చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో సహకారంతో రూ.12 కోట్లతో భారీ మంచినీటి సరఫరా పథకం ద్వారా అందుబాటులోకి 50 లక్షల లీటర్ల నీళ్ల తద్వారా పార్వతీపురానికి తీరనున్న మంచినీటి కొరత, ఇంతటి బృహత్తర పథకంలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు.

కార్యక్రమంలో టిడ్కో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, డిఇఇ బాలకృష్ణారెడ్డి, శశిధర్, అసిస్టెంట్ ఇంజనీర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, అడ్డాపుశిల సర్పంచ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెద్దమనుషుల ఒప్పందం అమలయ్యేనా?

- వైసిపి తెరపైకి చైర్ పర్సన్ మార్పు
- గాడి తప్పిన పురపాలన
- ముందుకు కదలని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - సాలూరు

సరిగ్గా రెండున్నరేళ్ల క్రితం మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం కోసం కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం అమలయ్యే సమయం ఆసన్నమవుతోంది. ఒకవేళ ఈ ఒప్పందం అమలైతే రెండు నెలలే సమయం ముందుంది. గతంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత చైర్‌పర్సన్ పీఠం కోసం పట్టణ వైసిపిలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. కౌన్సిల్‌లో మెజారిటీ కౌన్సిలర్ స్థానాలను కైవసం చేసుకున్న అధికారపార్టీకి చైర్‌పర్సన్ ఎంపిక అప్పట్లో కొంత తలనొప్పిగా మారింది. సీనియర్ నాయకులు పువ్వుల నాగేశ్వరరావు, జర్జాపు ఈశ్వరరావు గ్రూపుల మధ్య మున్సిపల్ ఎన్నికలు ఎత్తుకుపై ఎత్తులకు కేంద్ర బిందువుగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి పవనాలు బలంగా వీస్తున్న సమయంలో ఎన్నికలు జరగడంతో 20కౌన్సిలర్ స్థానాలను గెలుచుకుంది. చైర్‌పర్సన్ అభ్యర్థి ఎవరనేదానిపై పెద్ద హైడ్రామా నడిచింది. చైర్‌పర్సన్ కుర్చీ కోసం జర్జాపు ఈశ్వరరావు కుమార్తె నీలిమ, జర్జాపు సూరిబాబు కోడలు దీప్తి, పువ్వల నాగేశ్వరరావు భార్య ఈశ్వరమ్మ పోటీ పడ్డారు. పువ్వల కుటుంబానికి వైసిపి జిల్లా నాయకత్వం ఆశీస్సులు పుష్కలంగా వుండడంతో చైర్ పర్సన్ పీఠం ఈశ్వరమ్మకి దక్కింది. అయితే ఆ సమయంలో జర్జాపు కుటుంబాన్ని సంతృప్తి పరచడానికో, ఎన్నికల ఎత్తుగడలో భాగమో తెలియదు కానీ చైర్‌పర్సన్ పీఠం గురించి ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం కుదిరింది. మొదటి రెండున్నర ఏళ్ల పాటు చైర్‌పర్సన్‌గా పువ్వుల ఈశ్వరమ్మ, తదుపరి రెండున్నర ఏళ్ల పాటు జర్జాపు దీప్తిని కొనసాగించాలని అప్పట్లో ఒప్పందం జరిగింది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొరల సాక్షిగా ఆ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో పెద్ద మనుషుల ఒప్పందం అమలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఒప్పందం అమలు కోసం సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ఒప్పందం సూత్రధారులైన జెడ్పీ చైర్మన్, డిప్యూటీ సిఎంలపై జర్జాపు సోదరులు ఒత్తిడి పెంచుతున్నారు.

గాడి తప్పిన పురపాలన

గత కొంతకాలంగా పురపాలన గాడి తప్పుతోంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆమె పురపాలనపై దృష్టి సారించకలేకపోతున్నారు. నాగేశ్వరావు ఆరోగ్యంగా ఉన్నంతకాలం ఆయనే పురపాలనా వ్యవహారాలను పర్యవేక్షించే పరిస్థితి వుండేది. అయితే గత కొంతకాలంగా ఆ పరిస్థితి లేకపోవడంతో పురపాలన ఎవరికి వారే యమునా తీరే చందంగా తయారైంది. పట్టణంలో సుమారు రూ.6కోట్ల మేర అభివృద్ధి పనులు జరగకుండా ఉండిపోయాయి. కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. డిప్యూటీ సిఎం రాజన్నదొర కాంట్రాక్టర్లకు నచ్చజెపుతున్నా ఫలితం కనిపించడం లేదు.

చైర్ పర్సన్ మార్పు సాధ్యమా?

పెద్ద మనుషుల ఒప్పందం గడువు సమీపిస్తున్న తరుణంలో

చైర్‌పర్సన్ మార్పు అనే అంశం తెరపైకి వస్తోంది. మరో ఆరునెలల్లో సాధారణ ఎన్నికలకు సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి నాయకత్వం చైర్‌పర్సన్ మార్పుపై దృష్టి సారిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర వైసిపి అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. పెద్ద మనుషుల ఒప్పందంలో ఆయన కూడా ఉన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేసే అంశం పూర్తిగా ఆయన విచక్షణాధికారంపై ఆధారపడి ఉంది.

మారిన సమీకరణాలు

అధికారపార్టీలో రాజకీయ సమీకరణాలు మారాయి. రెండేళ్ల క్రితం నాటి పరిస్థితులు, ఇప్పుడు పట్టణ వైసిపిలో లేవు. గ్రూపులు యథాతథంగానే ఉన్నాయి. పెద్దమనుషుల ఒప్పందం జరిగిన నాటికి జర్జాపు సూరిబాబు పట్టణ పార్టీ అధ్యక్షుడుగా ఉన్నారు. కొద్దినెలల క్రితం ఆయన స్థానంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడును పట్టణ అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. కొద్దినెలల క్రితం వరకు వైస్‌చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడుతో సహా మెజారిటీ కౌన్సిలర్లు ఒకే గ్రూపులో ఉండేవారు. ఆ తర్వాత కొంతకాలానికి వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు జర్జాపు గ్రూపు నుంచి విడిపోయి చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ గ్రూపులో కొనసాగుతున్నారు. గతంలో కౌన్సిలర్ల అభిప్రాయానికి వ్యతిరేకంగా చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపిక జరిగిందనే వాదనలు వినిపించాయి. ఇప్పుడు కూడా పార్టీ నాయకత్వం పెద్ద మనుషుల ఒప్పందానికి కట్టుబడి వుంటుందా లేదా అనే చర్చ సాగుతోంది. పట్టణంలో పార్టీకి ఏకనాయకత్వం అవసరం ఉంది. చైర్‌పర్సన్‌గా సమర్థులైన వ్యక్తి వుంటే పరిపాలన గాడిలో పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యాన గురుగుబిల్లిలో మంళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, బివి రమణ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై అరాచకాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణ మణిపూర్ ఘటనేనని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మెజారిటీ మైతీ, మైనార్టీ కుకీల మధ్య బిజెపి కులఘర్షణలకు పురిగొల్పిందని విమర్శించారు. మతాన్ని, కులాన్ని రాజకీయాలకు వినియోగించుకొనే నీచపు సంస్కృతి బిజెపి వల్లే పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ లో జరుగుతున్న మారణ హోమాన్ని ఆపేందుకు కేంద్రం, రాష్ట్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మణిపూర్ సంఘటనను ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం.సావిత్రి, స్వాతి, కృష్ణవేణి, మాలతి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మణిపూర్‌లో కుకి తెగకు చెందిన గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి ఒక మహిళను చంపిన వారిని వెంటనే శిక్షించాలని, అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి హింసకు కారణం కాబట్టి వెంటనే మణిపూర్ సిఎం బీరెన్ సింగ్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలో టేఖరఖండిలో గిరిజనులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు రాము మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులకు, గిరిజనులకు, ముస్లిం, క్రిస్టియన్లకు రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మణిపూర్‌లో హింసను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయుకులు మురళి, రాజు , తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సాలూరు: మణిపూర్‌లో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. పట్టణంలోని గాంధీనగర్‌లో మణిపూర్‌లో మారణహోమానికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు, దాడులు పెచ్చరిల్లిపోతున్నాయని అన్నారు. గతంలో ఎన్నడూ చూడని హింసాత్మక ఘటనలు జరిగాయన్నారు. రాష్ట్రంలోని కుకీ,మైతీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారని చెప్పారు. మూడు నెలలుగా జరుగుతున్న మారణహోమాన్ని అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైన స్థానిక సిఎం, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్లమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు, పట్టణ నాయకులు టి.రవి, టి.ఇందు, టి.శంకరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ :మణిపుర్లో మహిళలపై అత్యాచారాలు చేసి, హత్యలను చేయడాన్ని ఖండిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆద్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ అదికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటనలు జరిగాయన్నారు. రెండు కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని అను కుంటున్నారన్నారు. జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ పార్లమెంట్లో ప్రధాని ఈ విషయమై మౌనం వహించడమంటే అత్యాచారాలను ప్రోత్సహించడమేనని అన్నారు. జిల్లా: సహధ్యక్షులు వి.జ్యోతి మాట్లాడుతూ ఈ ఆచారాలు దేహంపై జరిగే అత్యాచారాలు కావని, దేశం మీద జరిగేవని అన్నారు. ఈ సంఘటనలను దేశం యావత్తు ఖండించాలని అన్నారు. ఈ ర్యాలీ స్థానిక డిఇఒ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి మురళి, జిల్లా కార్యదర్శులు భాస్కరరావు, శ్రీనివాసరావు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

లోకేష్‌ను కలిసిన చిరంజీవులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో మంగళవారం నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు కలిశారు. లోకేష్‌ను కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్వతీపురం నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి ఆరా తీశారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ఆధారపడి ఉండకుండా, పార్టీ ప్రకటించిన కార్యక్రమాలైన మహాశక్తి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేయాలని, అంతేకాక నియోజకవర్గ నాయకులంతా కలిసికట్టుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

హడ్డుబంగిలో గడప గడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన నిర్వహించారు. హడ్డుబంగి పంచాయితీలో గల హడ్డుబంగి, హడ్డుబంగి కాలనీ, జామితోట, సవర బంగిగూడ, జాతాపు బంగిగూడ, కొత్తగూడ, పనసగూడ, చీడిమానుగూడ, అయ్యప్పగూడ, ఉప్పరజమ్మి, రేగుమానుగూడలో ప్రతి ఇంటికి వెళ్తూ, అక్కడ ఉన్న ప్రతి వ్యక్తితో మాట్లాడుతూ వారికున్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వీధి కుళాయిలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎంపిపి బిడ్డక ఆదినారాయణ, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపి ప్రతినిధి మూటక రామారావు, స్థానిక సర్పంచ్ సవర సుమతి, స్థానిక ఎంపిటిసి సవర సరోజిని, ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెద్ద అంకలం గ్రామ సచివాలయం పరిధిలో గల కృష్ణరాయపురంలో మంగళవారం గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గడపగడప కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే చూస్తామన్నారు. రోడ్లు, కాలువలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, సర్పంచ్ అన్నమనాయుడుతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు మండల స్థాయి అధిలు పాల్గొన్నారు.

మాతృభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

మాతృభాష విద్యా వాలంటీర్లను ప్రతి ఏటా రెన్యువల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు సవర డొంబు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 - 24 విద్యా సంవత్సరానికి మాతృభాష విద్యా వాలంటీర్లను రెన్యూవల్ చేయాలలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే మాతృభాష బోధనకు ప్రతిఏటా బడ్జెట్ కేటాయించాలని, కనీసవేతనం పెంచాలని డిమాండ్ చేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 150మంది సవర భాష వాలంటీర్లుగా పనిచేస్తున్నామన్నారు. గిరిజన భాషలో విద్యాబోధన వల్ల డ్రాపౌట్ తగ్గిందన్నారు. అయితే గత సంవత్సరం సవర భాష వాలంటీర్లను నియమించలేదని, దీనివల్ల ఎక్కువ గిరిజన విద్యార్థుల డ్రాపౌటుగా మిగిలారని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి వెంటనే విధుల్లో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సవర ఎల్లంగు, సవర మాసయ్య, సవర ఆనందరావు, సవర రాజు, సవర భారతి, సవర లక్ష్మి సవర కావ్య ఉన్నారు.

రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - కురుపాం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి రావాడ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల్లేకపోవడంతో తగిన ఫలితాలు రావడం లేదని, పాఠ్యపుస్తకాల్లేక నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎస్టీ హాస్టళ్లలో మెనూ అమలు చేయకుండా విద్యార్థుల నోరు కొడుతున్నారన్నారు. విద్యార్థులకు వస్తున్న మెస్ ఛార్జీల నుండి వర్కర్లకు జీతాలు ఇస్తున్నారని, దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్టీ హాస్టల్లో అమలయ్యేలా, పర్మినెంట్ వర్కర్లను తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ఐ మండల అధ్యక్షులు ఆరిక గంగారావు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయులు ప్రతిరోజు సకాలంలో హాజరు కావాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఇఒ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని టిక్కబాయిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. స్నేహభావం వాతావరణంలో విద్యా బోధన చేపట్టి పిల్లలు బడి పట్ల ఆసక్తి కనబరిచేలా పెంపొందించాలన్నారు. అప్పుడే డ్రాపౌట్ సంఖ్య లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెండో ఎంఇఒ బి.జనార్ధననాయుడు ఉన్నారు.

కంబరవలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర వలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులు, రక్తహీనత, మధుమేహ, రక్తపోటు రోగులకు, గర్భిణులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శాంత కుమారి, ఎఎన్ఎం సరస్వతి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్, టిడిపి నాయకులు కృష్ణమోహన్

సేవా కార్యక్రమాలతోనే సంతోషం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జన్మదిన సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేయడంలోనే నిజమైన సంతోషం ఆనందం ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. పట్టణ టిడిపి సీనియర్ నాయకులు మజ్జి కృష్ణమోహన్ 49వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఎన్టీయార్ విగ్రహం వద్ద పేదలకు జరిగే అన్న సంతర్పణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయన హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకను అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరం, స్వచ్ఛంద సంస్థలకు సహాయం చేసి ఇతరుల కష్టసుఖాల్లో మజ్జి కృష్ణమోహన్‌లా పాలుపంచుకోవాలని అన్నారు. ముందుగా బెలగాంలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టిడిపి నాయకులు, మజ్జి రాజా, మజ్జి వెంకటేష్, కోలా బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ 20.45 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో రూ.20.5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాల ఏర్పాటు, స్మశాన వాటిక, సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు సంబంధించి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డును అందుకుంటున్న సన్యాసిరావు, సిఇఒ శంకరరావు

మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీకి అవార్డు

ప్రజాశక్తి - సీతంపేట

మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీకి 42వ నాబార్డ్ ఫౌండేషన్ డే సందర్భంగా ఉత్తమ రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవార్డు లభించింది. విజయవాడలో మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆర్ట్స్ డైరెక్టర్ ఎన్ సన్యాసిరావు, మన్యం సహజ ఉత్పద్దాల కంపెనీ సిఇఒ బి శంకర్ రావు అందుకున్నారు. తమకు ఈ అవార్డు రావడానికి సహకరించి శ్రీకాకుళం నాబార్డు డిడిఎం కె.వప్రసాద్‌కు, పార్వతీపురం డిడిఎం తుఫాన్ నాగార్జునకు వీరు ధన్యవాదాలు తెలిపారు.

తోటపల్లి దేవస్థానం సిబ్బందికి వేతనాలు చెల్లింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి దేవస్థానం సిబ్బంది వేతనాలను మంగళవారం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చెల్లించారు. 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన నిధులున్న నిర్లక్ష్యం అనే కథనంపై సంబంధిత రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ స్పందించారు. తక్షణమే ఆలయానికి సంబంధించిన సిబ్బందికి చెల్లించాల్సి జీతాలను చెల్లించమని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆ ఆదేశానుసారం ఇఒ అకౌంట్లో మంగళవారం డబ్బులు జమ చేశామని సిబ్బందికి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

రాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలికి చెందిన సవరపు రాజు రేషన్ డీలర్ మరణించిన సంగతి తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు పరిషత్ రాజు సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, రంగు ముద్ర విద్యాసంస్థ అధినేత రంగుముద్ర నాగేంద్ర, వైసిపి నాయకులు ఎస్.రామారావు, ఎం.మాధవరావు, డి ధనుంజయతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం : డిప్యూటీ సిఎం



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర అన్నారు. మంగళవారం మక్కువలో 1,2 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు 1400 ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ప్రజల ఇంటిముందుకే అందించే కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. మండలంలోని నాలుగేళ్లలో రూ.20కోట్లకు పైగా 13 వేల మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. కొత్తగా ఇల్లు కట్టాలనుకుని నియోజకవర్గంలో 2300 ఇళ్లకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైసిపి మండలశాఖ అధ్యక్షులు మావుడి రంగునాయుడు, తహశీల్దార్ ఆవాల సూర్యనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలో జనగనన్న సురక్ష కార్యక్రమంలో సంఘం వలస, గంగాపురం సచివాలయాల్లో కొనసాగింది. సంగంవలసలో జరిగిన సురక్ష క్యాంపు కార్యక్రమానికి ఎంపిడిఒ ఎస్.రమేష్ అధ్యక్షత వహించారు. గ్రామంలోని పలువురు దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు రేషన్ కార్డులు అందించారు. ఫ్యామిలీ సర్టిఫికెట్, మ్యుటేషన్‌పై దరఖాస్తులు స్వీకరించి త్వరలోనే విచారణ జరిపి వారికి సంబంధిత పత్రాలు మంజూరు చేస్తామని తెలిపారు. గంగాపురం సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమానికి తహశీల్దార్ శివన్నారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఆత్మ చైర్మన్ ఎంద్రాపు తిరుపతిరావు, సంఘంవలస, కవిటిభద్ర, గంగాపురం సర్పంచులు బడే చిట్టి నాయుడు, వై.ఉషారాణి, ఎస్.లక్ష్మి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రాయగడ జమ్ము సర్పంచి పత్తిక అమల కోరారు. మండలంలోని రాయగడ జమ్ములో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలందరికీ అందుతున్నాయా లేదా అనేది తహశీల్దార్ జె.రాములమ్మ అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగదీష్‌కుమార్, ఎపిఒ శివరామకృష్ణ, ఎంపిటిసి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వాసుదేవరావు, వైసిపి నాయకులు పత్తిక బిసు, పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని గొట్టమంగళాపురంలో జగన్నన సురక్ష కార్యక్రమం తహశీల్దార్ సోమేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు గృహ పాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డొంక త్రినాధులు, సర్పంచ్ ఎన్ని బాబ్జీ నాయుడు తదితరులు ఉన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు, పెద్దఅంకలంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బి.రమణమ్మ 11 రకాల సేవలు ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం.బాబ్జీ, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కొటికపెంట సర్పంచ్ అప్పలనాయుడు

వీరఘట్టం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారమని సర్పంచి కె.వెంకటరమణ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని తూడిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమస్యలున్న సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలు కోరారు. అలాగే బిటివాడలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్జీదారులకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పివిఆర్ పురం, బిటివాడ సర్పంచులు ఉదయాన జగన్మోహన్రావు, ఎస్.నరసింహులు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, ఇఒపిఆర్‌డి వి.రామచంద్రరావు, ఆర్ఐ ఎస్.మారుతీరావు, సచివాలయ కార్యదర్శులు ఎ.చిన్నారావు, దుర్గారావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కోటికిపెంటలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా అందిస్తుందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దండి ఏడుకొండలు, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

ఆశా వర్కర్లకు ఇచ్చిన

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఈనెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నందుకు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయడం దారుణమని, వెంటనే వీటిని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేకు మంగళవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆశా కార్యకర్తలు ఆందోళన నిర్వహించారన్నారు. ఈ ఆందోళనకు సంబంధించిన ముందస్తుగానే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, పిహెచ్‌సి వైద్యాధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు స్థానిక వైద్యాధికారులు ఆశా వర్కర్లకు నోటీసులివ్వడం సమంజసం కాదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం అనేక దశల్లో ఆందోళనలు చేపడతామని, ఇది ప్రభుత్వానికి సమస్యల తీవ్రతను తెలియజేసేందుకు చేసే ప్రయత్నమని, దీనికి కూడా అధికారులు అవకాశం కల్పించుకుండా ఇలా బెదిరించడం సరైన విధానం కాదని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో, ఏ పిహెచ్‌సిలో ఆశా వర్కర్లకు నోటీసులివ్వలేదని, ఒక ఈ పిహెచ్‌సిలోనే ఎందుకు నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ఆందోళన నేపథ్యంలో వైద్యాధికారి డాక్టర్ సాగర్ జిల్లా అధికారులతో సంప్రదిపులు జరిపి షోకాజ్ నోటీసులు ఉపసంహరిస్తున్నట్లు నాయకులకు తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.ఇందిర, బివి రమణ, ఆశా వర్కర్ల నాయకులు గంగాభవానీ, మాలతి, పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుపరచండి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పట్టణంలో తాగునీటి సరఫరాతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న రంగు నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందుకు సంబంధించి నిధులను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామప్పలనాయుడు, ఇంజనీరింగ్ అధికారి ఆనందరావు, మున్సిపల్ చైర్మన్ బి గౌరీశ్వరి వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి ఇండుపూరు గుణేశ్వరరావు, పలు వార్డు కౌన్సిలర్లు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పారదర్శకంగా జరగాలి

ప్రజాశక్తి - కురుపాం

ఓటర్ల సర్వే పారదర్శకంగా జరగాలని, బిఎల్ఒలు చేపడుతున్న డోర్ టు డోర్ ఓటర్ల సర్వేకు రాజకీయ నాయకులంతా సహకరించాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ నాయకులకు, అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఓటర్ల డోర్ టు డోర్ సర్వేలో సిబ్బందికి సహకరించి కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్లను తొలగించడానికి సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కళ్ల కలకలకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

కండ్లకలకలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కండ్ల కలకలైతే కళ్ళద్దాలు వాడాలన్నారు. తరచుగా చేతులు కడుక్కోవాలని చెప్పారు. దూరంగా ఉండాలన్నారు. కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ అయితే కంటి వైద్యులను సంప్రదించాలన్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పిపి ఈతమానుగూడ పంచాయితీ, కె.గుమడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రసాయనిక మందులు, పురుగు మందులు వల్ల నష్టాలు, పెట్టుబడులు ఎక్కువ, దిగుబడి తక్కువ, చిరు ధాన్యాలు ఉపయోగాలు, మానవుడి ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవ రావు, ప్రోగామ్ కో ఆర్డినేటర్ హరిశ, పిపి ఈతమానుగూడ సర్పంచ్ ప్రతినిధి బి. మన్మధ రావు, వెలుగు సిబ్బంది.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

సీతంపేట : మండలంలోని చిన్నపల్లంకి, మిన్నకోట, పుబ్బాడ మంగళవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహన్‌రావు స్ప్రేయింగ్ చేశారు. దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం మలేరియా డెంగీ నివారణ మహోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా రక్తపూతలు సేకరించారు. జ్వరాలపై సర్వే నిర్వహించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మరిపిల్లి పంచాయతీలో గల నాగర బిటి రహదారి నుంచి సంతోష్ పురం గ్రామం వరకు 680 మీటర్లు రూ.40లక్షలతో అలాగే పొడి పంచాయతీలో సంతోషపురం గ్రామం నుంచి మీగడ వరకు 1860 మీటర్లు రూ.కోటీ 50 లక్షలతో కొత్తగా మంజూరైన బిటి రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వల్ల గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం కలుగుతూ రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వాణిజ్య విభాగాల వైసిపి జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసిపి మైనార్టీ విభాగ నాయకుల షేక్ నూరేళ్ల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరినాట్లు పనుల్లో బిజీబిజీగా ఉన్న రైతులు

ముమ్మరంగా వరి నాట్లు

ప్రజాశక్తి - బలిజిపేట

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 24 పంచాయతీల్లో ముమ్మరంగా వరి నాట్లు రైతులు నాటుతున్నారు. ముఖ్యంగా వర్షాధారంగా ఉన్న భూములకు ఎట్టకేలకు మోక్షం లభించింది. చివరికి పెదంకలాం ప్రధానకాలువ ద్వారా వచ్చే సాగు నీరు అధారంగా ఉన్నా భూముల రైతులకు కూడా ఈ మధ్య కురిసే వర్షాల వల్ల కాస్త ఊరట లభించింది. ఏది ఏమైనా వరుడు కరుణిస్తే తప్ప బతుకులు మారని పరిస్థితి మండలంలో నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి రైతులకు సాగునీరందిస్తానన్న ప్రభుత్వం నేటికీ అందించలేదు. పెదంకలాం అభివృద్ధికి కేటాయించిన జైకా నిధులు రూ.17.30 కోట్లు ఏమయ్యాయోనని మండల ప్రజల్లో చర్చ. దీనిపై పాలకులు, అధికారులు నోరుపెదడంలేదు.

బోధనలో మెలకువలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

బోధనలో మెలకువలు నేర్చుకోవాలని డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బయాలజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్నది పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డ్రాపౌలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించారు. వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చి ముందుకు తేవాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లను సక్రమంగా ఉపయోగించేలా చేయాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం భోజనం పథకం సక్రమంగా అందేలా చూడాలని. ఆదేశించారు.

బలిజిపేట : స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని బలిజిపేట మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన గణిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను సందర్శించిన ఎంఇఒ మాట్లాడుతూ, ఈ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న గణితం సబ్జెక్టుకు సంబంధించిన నూతన బోధనా పద్ధతులను తరగతి గది స్థాయిలో విద్యార్థులకు సులభమయ్యేలా బోధించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జయప్రసాద్ వ్యవహరించగా, రిసోర్స్ పర్సన్స్‌గా బివి రమణ, జగన్నాథరావు, స్థానిక సీఆర్పీ బి శ్రీరామ్, రెండు మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం : ఉపాధ్యాయులు సులువైన పద్ధతుల విద్యార్థులకు బోధించాలని ఎంఇఒ జి.సూర్యనారాయణ ఆర్.వెంకంపేట స్కూల్‌కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగం ఉంటే అంశాలను విద్యార్థులకు సులువైన తెలపాలన్నారు. విద్యార్థులు హాజరు సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జిల్లా ప్రసన్నలక్ష్మి, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల ఆందోళన

వీరఘట్టం: మండలంలోని ఆడారు పంచాయతీ డిపివలసకు చెందిన పలువురు రైతులు తమ న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు రైతులు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామంలో 300 ఎకరాల మెట్టు భూమి ఉందని, తాతల దగ్గర్నుంచి వారసత్వంగా పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. తమకు ఒకే నెంబర్ గల ప్రభుత్వ భూమి అని, డి-పట్టా భూమి అని, ఈ సమస్య అడంగల్‌లో వస్తుందని, భూమికి సంబంధించి ప్రతి ఏటా పన్నులు కడుతున్నామని, రెవెన్యూ వారిచ్చిన పాస్ పుస్తకాల ప్రకారం తమ భూములు తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

సకాలంలో సరుకులు అందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి కార్యాలయాన్ని జిసిసి స్టేట్ డైరెక్టర్ చిన్నారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, ఇండేన్ గ్యాస్ గోదాము, డిఆర్ డిపోలను పరిశీలించారు. గిరిజన సహకార సంస్థ బ్రాంచిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రతినెలా సకాలంలో ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరుకులను సకాలంలో అందించాలని సూచించారు. గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతి, గోదాము సూపరిటెండెంట్ సాంబశివరావు, జిసిసి ఉద్యోగుల సంఘం నాయకులు ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ముగడ గణపతిపై దాడి చేసిన నర్సిపురం పాఠశాల చైర్మన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు కె. గౌరీశ్వరరావు కోరారు. సీటు సెంట్రింగ్ పనిలో ఉన్న గణపతిపై దాడి చేశారని, దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాటిగుమ్మడలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గాటిగుమ్మడిలో టిడిపి నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో మన భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు అందించే పథకాలు, యువత కు ఉపాధి, నిరుద్యోగభృతిని టిడిపి అందిస్తుందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కుంపి, మాజీ ఎంపిటిసి బి.జయలక్ష్మి, స్థానిక నాయకులు ఆరిక తిరుపతి, ఆరిక ప్రసాద్, నిమ్మక నాగరాజు, బిడ్డిక మంగయ్య, బిడ్డిక బాపన్న, బిడ్డిక జయ లక్ష్మి, ఆరిక అమల, సరోజిని తదితరులు ఉన్నారు.

సీతంపేట: భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర మండలంలోని పులిపుటిలో టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం ఆధ్వర్యంలోజరిగింది. టిడిపి మేనిఫెస్టో ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని లిమహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరిక సువర్ణ, బిడ్డిక సుజాత(సర్పంచ్), నిమ్మక రోజా, నిమ్మక దమయంతి, సరిత, కుండంగి సావిత్రి, హరిత వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ కొసగూడలో మహాశక్తి చైతన్యరథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ప్రతి ఒక్క కుటుంబానికి రూ.1,22,000 ఆదాయం అందేలా మేనిఫెస్టోను తయారు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజల కష్టాలు తీరాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

1450 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

అక్రమసార రవాణాకు అడ్డుకట్ట వేసే భాగంగా మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 1450 సానా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కారు, స్కూటీ సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలం పి.కోనవలస చెక్పోస్ట్ వద్ద మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఒడిశా పొట్టంగి నుంచి ఇద్దరు వ్యక్తులు మారుతి డిజైర్ కారులో వెయ్యి సారా ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డారు. అలాగే అదే గ్రామం నుంచి స్కూటీపై ఇద్దరు వ్యక్తులు 450 సారా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుపడ్డారు. ఈ మేరకు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కారు స్కూటీని సీజ్ చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

పేకాట వివాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేటకు చెందిన ఎందవ విజయకుమార్, పెంకి ప్రసాద్ మంగళవారం వారి స్వగ్రామంలో పేకాట ఆడుతుండగా రేగిన స్వల్ప వివాదంలో వారిద్దరి మధ్య జరిగిన కొట్లాట జరిగింది. వారితో పాటు వారి మిత్రులు మరో ఇద్దరికి గాయాలు కాగా, జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.